## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆకస్మిక మృతి



మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి

**వెదురుకుప్పం :** మండలంలోని తిప్పినాయుడుపల్లె దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాబర్టు (25) ఆకస్మికంగా మరణించాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆగ్రామానికి వెళ్లి, మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ తరుపున ఆదుకుంటామని భరోసా కల్పించారు. మంత్రి వెంట స్థానిక సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు భాస్కర్, బొమ్మయ్యపల్లె సర్పంచ్ గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

### అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

**నగరి :** మండలంలోని గుండ్రాజ్ కుప్పం దళితవాడకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రత్నం కుమారుడు మేషక్ మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఆర్కేరోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి గురువారం గ్రామానికి చేరుకున్నారు. మేషాక్ మృతదేహంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. రత్నం కుటుంబాన్ని ఓదార్చారు. అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

### పల్లెల్లో కేంద్ర బలగాల కవాతు



పెనుమూరు మండలంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

**పెనుమూరు(కార్వేటినగరం):** ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్రబలగాలు, పోలీసు బలగాలతో కలసి పెనుమూరు మండలంలోని గుడ్యాణంపల్లె, గొడుగుమానిపల్లె, కలవకుంట గ్రామాల్లో గురువారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా చిత్తూరు తూర్పువిభాగం సీఐ కుళ్లాయప్ప మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కేంద్ర బలగాలు వచ్చాయని, కవాతు ప్రదర్శన ముఖ్యఉద్దేశం ప్రజల్లో ఎన్నికల నిర్వహణపై నమ్మకం, ఆత్మవిశ్వాసం నిండానికేనని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలు, విచ్ఛిన్నకర శక్తులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికలపై ప్రజలు ఎలాంటి అనుమానాలు వద్దని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. నిర్భయంగా ప్రజలందరూ తమ ఓటు హక్కుని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సమస్యాత్మక గ్రామాల్లో ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్ పాల్గొన్నారు.

### సూర్యప్రభ వాహనంపై విహారం



పుర వీధుల్లో విహరిస్తున్న స్వామివారు

**గుడుపల్లె:** మండలంలో కనమనపల్లెలోని శ్రీ శ్రీనివాసస్వామి ఆలయంలో గురువారం సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా పద్మావతి శ్రీనివాస స్వామికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేద పండితులు స్వామివారిని సూర్యనారాయణుడు అలంకరణతో ముస్తాబు చేసి, మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

# బాబు హామీలు నమ్మితే ▸ మళ్లీ మోసపోతారు

- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఎంపీపీ శ్యామల

**పొలసముద్రం :** మోసపూరిత హామీలతో మహిళలు, రైతులను ముంచేందుకు మళ్లీ ప్రతిపక్ష నేత చంద్రబాబు మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మితే మళ్లీ మోసపోతారని రాజంపేట పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. గురువారం పాలసముద్రంలో ఆయన జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం అంటూ గొప్పలు చెప్పుకునే చంద్రబాబుకు సొంతంగా పోటీ చేసి గెలిచేసత్తా లేదన్నారు. గతంలో మోదీ పరిపాలనపై విరుచుకుపడిన చంద్రబాబు ఇప్పుడు బీజేపీతో పొత్తు పెట్టుకునే స్థాయికి దిగజారిపోయాడన్నారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం 99 శాతం పూర్తి చేశారన్నారు. అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సింహంలా సింగిల్‌గా ముందుకెళుతున్నారన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రయాణం చేసే వరకూ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా ముందుకు సాగాలన్నారు. వైఎస్సార్ సీపీ 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. 14 ఏళ్లు అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబుకు సంబంధించి భూతద్దం పెట్టి వెతికినా ఒక్క సంక్షేమ పథకం లేదంటే ఆయన పరిపాలన ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు చెబితే ఇప్పటికి కూడా ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 ఆరోగ్యశ్రీ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. ఆయన తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి చరిత్రలో నిలిచిపోయేలా పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ అభివృద్ధి , సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వనివి కూడా అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు 32 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి, ఇప్పటికే 16 లక్షల ఇళ్లు పూర్తి చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబుకు మధ్య నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. దేశ రాజకీయాల్లో ఇప్పటివరకు మీకు మేలు జరిగితేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అనంతరం ఎంపీ సమక్షంలో పాండుయాదవ్, నీలమేఘం, మణిరెడ్డి, సంజీవరాయన్, మాజీ సర్పంచ్ గోపాల్, గోవిందయ్య, స్వామిదాస్ తోపాటు 100 మందికి పైగా టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలా శివప్రకాష్, మండల కన్వీనర్ తులసియాదవ్, పారిశ్రామికవేత్త షణ్ముగం, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, దయసాగర్‌రెడ్డి, శేఖర్‌రాజు, చందు, ధనుంజరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గుణశేఖర్ మొదలియార్, బాబురెడ్డి, ఎత్తేరి సంతోష్, జిల్లా సంయుక్త కార్యదర్శి సుబ్రమణ్యారెడ్డి, రైతు భరోసా మండల చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరాజ్, వైఎస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, శోభ, భాస్కర్, షణ్ముగరెడ్డి, వేణు, రవిరెడ్డి, సుమన్‌రాజు, ప్రకాష్, వాసురాజు, నరసింహనాయుడు, ధనంజయ రెడ్డి, అరుల్, బాబు, లోకదాస్, జేఏసీ మండల కన్వీనర్ వేణు, గోపీనాథ్, చంద్ర, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యరెడ్డి, మాజీ సర్పంచ్ గణేష్‌రెడ్డి, శీను మందడి, సిద్ధ మందడి, వెంకటేష్, దినకర్, పయణి, నరసరాజు, పెనుమూరు ఏఎంసీ డైరెక్టర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

# జగనన్నతోనే సంక్షేమం సాధ్యం



ఎన్నికల ప్రచారం చేస్తున్న సెల్వమణి

- రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి
- పుత్తూరు మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం

**పుత్తూరు:** అర్హులైన వారందరికీ విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని వైఎస్సార్ సీపీ నేత, రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి తెలిపారు. ఆయన గురువారం సాయంత్రం పుత్తూరు మున్సిపాలిటీలోని 10వ వార్డు బలిజవీధి, కామరాజునగర్, శీలకారువీధిలో ఎన్నికల ప్రచారం చేశారు. ప్రతి గడపకూ వెళ్లి ఐదేళ్లుగా జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ కులం, మతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని అన్నారు. 2019 ఎన్నికల సందర్భంగా జగనన్న విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని హామీలను 99 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి గడపకూ సంక్షేమ పథకాల ద్వారా రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రజలకు వంద శాతం సంక్షేమం, అభివృద్ధిని అందించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పలు హామీలు గుప్పించి తర్వాత ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడి నైజమన్నారు. జగనన్న ఇచ్చిన హామీలనే కాకుండా, చెప్పని పలు కార్యక్రమాలను సైతం చేశారని ఇదీ వైఎస్సార్ కుటుంబం నైజమన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. ఇలా పలు విధాలుగా ప్రజలకు చేయూతనిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. ప్రతి కుటుంబమూ ఆర్థికాభివృద్ధి సాధించాలంటే రాష్ట్రానికి జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జగనన్న కోసం జనసైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మను నగరి నుంచి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు కుప్పమ్మ, ఏకాంబరం, పార్టీ నాయకులు లారీమోహన్, మనోహర్‌రెడ్డి, జయరామిరెడ్డి, కడియాల నాయుడు, గోపి, ప్రవీణ్, మురళీరెడ్డి, కైలాసం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీననే నాపై టీడీపీలో చిన్న చూపు

- మాజీ వైస్ ఎంపీపీ హంస



మాట్లాడుతున్న మాజీ వైస్ ఎంపీపీ హంస, గోవిందరాజులు

**విజయపురం :** ఎస్సీని కావడం వల్లే టీడీపీలో తనను చిన్న చూపు చూశారని, అందువల్లే తాను టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరానని మాజీ వైస్ ఎంపీపీ హంస తెలిపారు. ఆమె గురువారం తన భర్త గోవిందరాజులుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారమని తెలిపారు. దీంతో తనపై ఆ పార్టీలో చిన్న చూపు చూశారని తెలిపారు. తాను టీడీపీ మండల అధ్యక్ష పదవికి ఎస్సీ పేరు ప్రతిపాదించడంతో టీడీపీ మండల అధ్యక్షుడు కక్ష కట్టి నిరాధార ఆరోపణలు చేశారని తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. గ్రామంలో టీడీపీలో వర్గాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రతి పంచాయతీలోనూ వర్గ విభేదాలు సృష్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని, మండల అధ్యక్షుడి ఒత్తిడి భరించలేకపోయానని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలో అన్ని వర్గాల వారినీ సమానంగా చూస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి విజయానికి కృషి చేస్తామనని పేర్కొన్నారు.

### తైక్వాండో క్రీడలో ఉచిత శిక్షణ

**తిరుపతి ఎడ్యుకేషన్:** వేసవి సెలవుల నేపథ్యంలో ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు తైక్వాండో క్రీడలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ డాక్టర్ కె.గోపినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్‌లోని తైక్వాండో శిక్షణ కేంద్రంలో ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఒలింపిక్స్ గుర్తింపు పొందిన తైక్వాండో ఆత్మ రక్షణ క్రీడ అని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 95731 44231, 81217 71968 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### మామిడి సాగులో ప్రత్యేక శ్రద్ధ అవసరం



మామిడి పంటపై రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యాన అధికారి శైలజ

**చంద్రగిరి:** వేసవిలో మామిడి పంటలపై రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరమని మండల ఉద్యాన అధికారి శైలజ అన్నారు. గురువారం ఆమె మండల పరిధిలోని గంగుడుపల్లి గ్రామంలోని మామిడి తోటలను పరిశీలించారు. ఉష్ణోగ్రతలు పెరగడం, గాలిలో తేమ శాతం తక్కువగా ఉండడంతో మామిడిలో తామర పురుగు, నల్ల తామర పురుగు, గొంగళి పురుగులు వృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. నివారణకు అజాడిరక్టిన్ 10,000 పీపీఎం 1 మి.లీ, బుప్రోఫెజిన్ 15%ఈసీ+ ఎసిఫేట్ 35% ఈసీ – 1 గ్రా, కార్బెండజిమ్ 1 గ్రా, జిగురు 0.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి తప్పనిసరిగా ఒకసారి పిచికారీ చేసుకోవాలని సూచించారు. బేనీషా, మల్లిక, నీలం తదితర టేబుల్ రకాలకు కాయ నిమ్మకాయ పరిమాణంలో ఉన్నపుడు ఫ్రూట్ కవర్లను కట్టాలన్నారు. దీంతో కాయకు తెగుళ్లు, పురుగులు, ఈదురు గాలుల నుండి రక్షణ కలుగుతుందన్నారు. అంతే కాకుండా మంచి ధరను పొందవచ్చని తెలిపారు. ఒకో ఫ్రూట్ కవర్ ధర రూ.2 నుంచి రూ.2.10కు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది కనుక మామిడి తోటలలో నీరు లేని వారు మల్టీ కె–10 గ్రా ఒక లీటరు నీటికి కలిపి కాయ నిమ్మకాయ సైజులో ఉన్నపుడు పిచికారీ చేసుకుని పిందె రాలకుండా, నీటి ఎద్దడి నుండి తోటను రక్షించుకోవచ్చని, నీరు ఉన్నవారు అవసరాన్ని బట్టి పది రోజులకు ఒకసారి నీరు పెట్టాలని రైతులకు ఆమె సూచించారు.

# నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించండి

–అధికారులను ఆదేశించిన కలెక్టర్ షణ్మోహన్



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

**చిత్తూరు కలెక్టరేట్:** వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి గ్రామాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంప్ కార్యాలయం నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించి నివేదికలను సోమవారంలోపు పంపాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణతో పాటు ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. పటిష్ట ప్రణాళికను రూపొందించాలని తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ఉన్న బోర్ల నుంచి నీటిని సరఫరా చేయాలన్నారు. నాడు నేడు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో బోర్లు ఉన్నాయని, అక్కడ నుంచి నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. బోర్ల మెకానిక్‌లు లేని చోట వెంటనే నియమించుకోవాలన్నారు. 250కి పైగా మండలాల్లో బోర్లు ఉన్నట్లైతే ఇద్దరు మెకానిక్‌లను నియమించాలని తెలిపారు. ఇరిగేషన్ చెరువులలో పశువులకు నీటిని వినియోగించుకోవాలని తెలిపారు. ఓల్టా చట్టం పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో చిత్తూరు ఆర్‌డీ శ్రీనివాసులు, మండల అధికారులు పాల్గొన్నారు.

# మంచిని గుర్తించి ఫ్యానును ఆదరించండి



మేం సిద్ధం మా బూత్ సిద్ధంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి



ఓట్లను అభ్యర్థిస్తున్న రామ్ ప్రసాద్‌రెడ్డి

**నగరి :** ఈ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచిని గుర్తించి ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా ఆర్కే రోజాను గెలిపించాలని ముడిపల్లి పంచాయతీకి చెందిన నాయకులు, కార్యకర్తలు కోరారు. వారు గురువారం మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో మేం సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను సాక్ష్యాలతో సహా వివరించారు. వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. గత ఎన్నికల్లో తాము ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని, అందుకే చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం వివరాలతో ధైర్యంగా ప్రతి ఇంటికీ వస్తున్నామన్నారు. ప్రజలకు మంచి చేసి నేడు ప్రతి నాయకుడు, కార్యకర్తల నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తినని కాలర్ ఎగరవేసేలా జగనన్న పాలన ఉందన్నారు. జగనన్న బాటలోనే నడుస్తున్న మంత్రి ఆర్కేరోజా నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. అందరూ మంచివైపు అండగా నిలబడితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీలు కన్నియప్ప, ఢిల్లీబాబు, పార్టీ అధ్యక్షుడు సుదర్శన్ నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ తిరుమల రెడ్డి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్‌లు ప్రకాష్, రవికుమార్, నాయకులు రామూర్తి, గుణశేఖర్, శేఖర్, చిట్టిబాబు, టీపీ శేఖర్, పురుషోత్తం, శరవణ, గోవిందయ్య, చంద్రశేఖర్ నాయుడు, జగదీష్, వెంకటేశ్వర్లు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ది ఫ్యామిలీ స్టార్ చిత్రం ట్రైలర్ విడుదల




ది ఫ్యామిలీ స్టార్ చిత్రం ట్రైలర్ విడుదల అనంతరం మాట్లాడుతున్న విజయ్ దేవరకొండ

- మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్
- హీరో విజయ్ దేవరకొండ వెల్లడి

**తిరుపతి కల్చరల్:** పరశురాం దర్శకత్వంలో రూపొందించిన ది ఫ్యామిలీ స్టార్ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ యువ హీరో విజయ్ దేవరకొండ గురువారం రాత్రి పీజీఆర్ థియేటర్‌లో అభిమానుల మధ్య విడుదల చేశారు. ట్రైలర్ విడుదలను పురస్కరించుకొని రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన హీరో విజయ్ దేవరకొండకు అభిమానులు భారీ స్థాయిలో స్వాగతం పలికారు. అక్కడ నుంచి తిరుపతిలోని పీజీఆర్ థియేటర్ వరకు అభిమానులు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం థియేటర్‌లో అభిమానుల కేరింతల నడుమ హీరో విజయ్ దేవరకొండ చిత్రం ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులనుద్దేశించి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనార్థం అనేక పర్యాయాలు తిరుపతికి వచ్చిన తాను మొదటి సారిగా సినిమా ఫంక్షన్‌కు తిరుపతికి రావడం సంతోషకరమన్నారు. ఇదే రోజు ఉదయం హైదరాబాద్‌లో ట్రైలర్ విడుదల చేసి నేరుగా తిరుపతికి చేరుకొని శ్రీవారి పాదాల చెంత చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయడం మహద్భాగ్యమన్నారు. ఇక్కడ ప్రజలు, అభిమానులు చూపిన ఆదరణ చేసి మనసు ఉప్పొంగుతోందన్నారు. ఇప్పటి వరకు గీతగోవిందం వంటి చిత్రాలు చేశానని, వీటిని అన్నింటిని కలుపుకొని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ది ఫ్యామిలీ స్టార్ చిత్రాన్ని రూపొందించామన్నారు. కుటుంబ సమేతంగా ప్రజలంతా ది ఫ్యామిలీ స్టార్ చిత్రాన్ని వీక్షించి ఆదరించాలని పిలుపునిచ్చారు. మళ్లీ తిరుపతిలో ఈ చిత్రం విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని, ఆ నమ్మకం ఉందన్నారు. అనంతరం హీరో విజయ్ దేవరకొండ అభిమానులతో సెల్ఫీ దిగుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డిస్ట్రిబ్యూటర్, పీజీఆర్ సినిమా థియేటర్ అధినేత పాండ్రవేటి అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.

### పుట్టుకతోనే మానవ హక్కులు

**ఏర్పేడు:** మనుషులంతా ఒక్కటేనని, మనిషి పుట్టుకతోనే మానవ హక్కులు సంక్రమిస్తాయని ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి మార్ధాల రవిబాబు అన్నారు. గురువారం మండలంలోని పాపానాయుడుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మానవహక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కుల, మత, వర్ణ, లింగ, భాష, ప్రాంతీయ భేదాలతో మానవ హక్కులకు భంగం వాటిల్లుతోందని, అసమానతలు తొలగాలంటే ప్రాథమిక స్థాయి నుంచి బాలలు, మానవ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, నాగరాజు, గోవిందరాజన్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవిబాబు

# శోభారాజ్ సేవలు ఆదర్శనీయం



శోభారాజ్‌ను సన్మానిస్తున్న భూమన్, శతావధాని మురళి




మాట్లాడుతున్న శ్వేత సంచాలకులు భూమన్

**పుత్తూరు:** సంగీత, సాహిత్యంలో శోభారాజ్ సేవలు అభినందనీయమని టీటీడీ శ్వేత సంచాలకులు భూమన్ తెలిపారు. ఆమెను గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భూమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శోభారాజ్ చెన్నైకి చెందిన ఇకాస్ టెక్నాలజీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూనే తమిళ, తెలుగు రాష్ట్రాల్లో ప్రజాసేవలో తరిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ధనం, దానం, భోగం, వైరాగ్యం లక్షణాలతో శోభారాజ్ ప్రకాశిస్తున్నారని కొనియాడారు. ప్రకృతితో మమేకమైతే వయస్సు గుర్తుకు రాదన్నారు. ప్రతి వ్యక్తీ తన చివరి శ్వాస వరకు వృద్ధాప్యం గురించి ఆలోచించరాదని సూచించారు. సన్మాన గ్రహీత సి.శోభారాజ్ మాట్లాడుతూ పుత్తూరులో 2004 నుంచి రెండు దశాబ్దాల పాటు విశ్రాంత ఉద్యోగులు సంఘటితంగా చేస్తున్న విద్య, వైద్యం, సంగీతం, సాహిత్యం తదితర పలు సేవా కార్యక్రమాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని చెప్పారు. వృద్ధాప్యంలోనూ సంఘం సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. తనకు పుత్తూరు పట్టణంతో ఆత్మీయ అనుబంధం ఉందన్నారు. ఈ సందర్భంగా సంఘం భవనం అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళమిచ్చారు. కార్యక్రమంలో శతావధాని అముదాల మురళి, తిరుపతి సంస్కార ఫౌండేషన్ ప్రతినిధులు రాకేష్‌కుమార్, శ్రీనివాసమూర్తి, సంఘం నాయకులు గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### లారీని ఢీకొన్న కారు

– ఒకరికి తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సెట్) గాయపడిన మహేష్

**తవణంపల్లె:** లారీని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన పట్నం సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెనుమూరు మండలంలోని అలుగూరుపల్లెకు చెందిన సి.సుబ్రమణ్యంరెడ్డి కుమారుడు మహేష్(45) మారుతి బ్రీజర్ కారులో తిరుపతి నుంచి బెంగళూరుకు వెళుతున్నాడు. పట్నం సమీపంలో కారులో వెళుతుండగా ముందు వెళుతున్న లారీని అదుపు తప్పి వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న మహేష్ తలకు తీవ్రగాయమైంది. గాయపడ్డ అతన్ని వేలూరులోని రాణీపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.